
క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ పథకం ఏపీఓ వెంకటప్పల నాయుడు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే గరిష్ఠ వేతనం అందుతుందని చెప్పారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ గోవింద్‌ను ఆదేశించారు.

కన్యకా పరమేశ్వరి ఉత్సవాలకు సర్వం సిద్ధం



కన్యకపరమేశ్వరి

విజయనగరం టౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉదయం 4.30 గంటల నుంచి మహాగణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం 108 మంది దంపతులతో అష్టోత్తర శత కలశ ప్రదక్షణ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అఖండ దీపారాధన, రుత్విక్ వరుణ, మండపారాధన, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18న ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, సూర్యనమస్కారాలు, వాసవీ మూలమంత్ర జప సహిత హోమం, ఆయుష్య హోమం, పునర్వసు నక్షత్ర జపం, 108 కలశాల జలముతో వాసవీమాతకు అభిషేకం.. ఉదయం 9 గంటలకు అమ్మవారికి బంగారు చీర, వజ్రకిరీటం అలంకరణ, స్వర్ణ పుష్ప అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి ఉంటాయన్నారు. మధ్యాహ్నం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు దంపతుల సౌజన్యంతో అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ, అనంతరం గజవాహనంపై అమ్మవారి తిరువీధి ఉత్సవం ఉంటుందని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: పోషక విలువలున్న ఆహారాన్ని తింటేనే ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

గొడవలు వద్దు: ఎస్సై



సంకిలిలో పర్యటిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది

రేగిడి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని, ఇప్పుడు బెట్టింగ్‌లు, గెలుపు ఓటముల పేరుతో వివాదాలకు ఆస్కారమివ్వొద్దని ఎస్సై శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. మండలంలోని సంకిలి, కాగితాపల్లి తదితర గ్రామాల్లో బుధవారం సిబ్బందితో పర్యటించారు. ఇంకా ఎన్నికల కోడ్ అమలులో ఉందని, కోడ్ ఉల్లంఘనకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గెలుపోటములను పార్టీల అభిమానులు సమానంగా తీసుకోవాలని, గొడవలు పడవద్దని సూచించారు.

ఊరటనిచ్చిన వర్షం



రేగిడిలో కురుస్తున్న వర్షం

రేగిడి: మండలంలో బుధవారం ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. వాతావరణం చల్లబడటంతో పాటు వాణిజ్యపంటలైన చెరుకు, వేరుశనగకు ఈ వర్షం జీవం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు వృథా చేయొద్దు

రేగిడి: గ్రామాల్లో కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిని ప్రజలు వథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ అన్నారు. మండలంలోని చిన్నయ్యపేట, సంకిలి, బొడ్డవలస తదితర గ్రామాల్లో తాగునీటి కుళాయిలను బుధవారం ఆయన పరిశీలించారు. వేసవిలో అన్ని గ్రామాలకు తాగునీరు అందే విధంగా చర్యలు చేపడుతున్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. కుళాయిల వద్ద బట్టలు ఉతకడం, ఇంటి నిర్మాణాలకు పైపుల ద్వారా నీటిని తరలించడం వంటివి చేయరాదని కోరారు.

అందరి నోటా ఒకటే మాట

- మంత్రి బొత్స విజయం ఖాయమంటూ సర్వత్రా చర్చ
- నియోజకవర్గంలో 83.48 శాతం పోలింగ్ నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు: 1,71,533 మంది
- గుర్ల మండలంలో అధికంగా 86.75 శాతం పోలింగ్

చీపురుపల్లి: పోలింగ్ ముగిసింది...ఎన్నికల హడావుడి తగ్గింది...అంతా అయిపోంది అనుకోవద్దు.. ఇప్పుడే అసలు కథ మొదలయ్యింది. ఓట్ల లెక్కింపునకు మరో రెండు వారాల గడువు ఉన్న నేపథ్యంలో గెలుపు ఓటములపై ఎక్కడ చూసినా ఒకటే చర్చ జరుగుతోంది. జిల్లా కాదు రాష్ట్రంలో నే రాజకీయంగా ప్రాముఖ్యత కలిగిన చీపురుపల్లి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే ఇద్దరు పేరున్న సీనియర్లు బొత్స సత్యనారాయణ, కిమిడి కళా వెంక టరావు పోటీ చేసిన నేపథ్యంలో ఇక్కడి గెలుపు, ఓటములపై సర్వత్రా చర్చ నెలకొంది. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీలో ఉన్న బొత్స సత్యనారాయణ ఇరవై సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ ఎన్నికల్లో పోటీ చేస్తూ 2014లో మినహా మిగిలిన ఎన్నికల్లో గెలుపొందుతూ వస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిమిడి కళావెంకటరావు వలస వచ్చి తొలిసారి చీపురుపల్లిలో టీడీపీ కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 13న జరిగిన పోలింగ్ అనంతరం జరుగుతున్న చర్చల్లో బొత్స విజయం నల్లేరుపై నడకే అన్న మాట అందరి నోటా వినిపిస్తోంది. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్న బొత్స గెలుపు ఎన్నికల ముందే ఖాయమైపోయిందని గ్రామాల్లో సైతం చర్చించుకుంటున్నారు.

పోలైన ఓట్లు 1,71,533

నియోజకవర్గంలో పోలింగ్ శాతం భారీ స్థాయిలో నమోదయ్యింది. 83.48 శాతం పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది. సోమవారం పోలింగ్ రోజున ఈవీఎంలు మొరాయించడంతో తెల్లవారు ఝామున 4 గంటల వరకు గుర్ల మండలంలోని చింతలపేటలో పోలింగ్ జరిగింది. తెల్లవారు ఝాము వరకు ఓటర్లు క్యూలో నిలబడి పోలింగ్‌లో పాల్గొనడం విశేషంగా మారింది. నియోజకవర్గంలో 2,05,484 మంది ఓటర్లు ఉండగా అందులో 1,71,533 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మెరకముడిదాం మండలంలోని యాడిక గ్రామంలో 1027 మంది ఓటర్లు ఉండగా 980 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా ఆ గ్రామంలో 95.42 శాతం పోలింగ్ నమోదయ్యింది.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు, పోలింగ్ శాతం వివరాలు ....

మండలం	ఓటర్లు	ఓటు వేసిన వారు	పోలింగ్ శాతం
చీపురుపల్లి	49,178	40,676	82.71
మెరకముడిదాం	46,869	38,744	82.66
గరివిడి	56,120	45,863	81.72
గుర్ల	53,317	46,250	86.75
మొత్తం	2,05,484	1,71,533	83.48

నేటి నుంచి బీసీజీ వ్యాక్సినేషన్



మాట్లాడుతున్న కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ

కొత్తవలస: క్షయ(టీబీ) వ్యాధి నివారణ కోసం, వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు వయోజనులకు గురువారం నుంచి బీసీజీ (బాసిల్లస్ ఆఫ్ కాల్మెట్, గురిన్) టీకా వేయనున్నట్లు కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు చిన్నారులకు మాత్రమే ఈవ్యాక్సిన్ వేసేవారమని, ఇక నుంచి 18 సంవత్సరాలు దాటి న వారందరికీ వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసేవారికి తప్పక ఈ టీకాలు వేయాల ని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు, హెచ్‌ఐవీ, కాన్సర్ వ్యాధి గ్రస్తులకు, అవయవ మార్పిడి చేసుకున్నవారికి, ఆరునెలల ముందు రక్త మార్పిడి చేసుకున్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, జ్వరం,దగ్గుతో బాధపడుతున్న వారు, బరువు తగ్గిన వారికి ఈ టీకాలు వేయకూడదన్నారు. వ్యాక్సినేషన్‌పై పీహెచ్‌సీ సిబ్బందికి అవగాహన కల్పించామని చెప్పారు.

మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం: క్షయ నివారణకు మండలంలోని అన్ని సచివాలయాల్లో గురువారం నుంచి బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించను న్నట్లు మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారికి, క్షయ వ్యాధిగ్రస్తులు, వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లి: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పట్టణంలోని ఆరు కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు పౌష్టికాహారం లేక దీర్ఘకాలిక వ్యాధిని ఎదుర్కొనలేక ఇబ్బందులు పడుతుంటార ని చెప్పారు. అలాంటి వారి కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు పదిహేను సంవత్సరాలుగా ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. నిత్యావసర సరుకులతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్కవరపుకోట, సంతపేట, రంగరాయపురం , సోంపురం, ఖాసాపేట, తలారి, కొట్యాడ, సీతారంపురం, గొల్జాం, వేపాడ మండలంలోని పాటూరు, ఓబలయ్యపాలెం, ముకుందపురం, బొద్దాం, కొత్తబొద్దాం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంయమనం పాటించాలి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

లక్కవరపుకోట: ఎన్నికల పోలింగ్ ముగిసిందని, ఎన్నికల నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు గొడవలకు దిగకుండా సంయమనం పాటించాలని ఎస్‌ఐ గోపాలరావు సూచించా రు. మండలంలోని చందులూరు, రేగ, ఖోల్లిపల్లి, సీతాగొర్లెవానిపాలెం తదితర గ్రామాల్లో బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించారు.వివాదస్పద వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.ఈ సమయంలో కేసులు నమోదు అయితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

నాడు మోడు బారి... నేడు చిగురించి



నెల రోజుల క్రితం ఆకులు మొత్తం రాలిపోయి మోడుబారిన రావిచెట్టు



ప్రస్తుతం పచ్చదనంతో కళకళాడుతున్న రావిచెట్టు

కొత్తవలస: మండలం మీదుగా ఉన్న అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో నిమ్మలపాలెం బ్రిడ్జి వద్ద ఉన్న రావి చెట్టు నెల రోజుల క్రితం ఆకులన్నీ రాలిపోయి మోడుబారిపోయింది. సరిగ్గా నెల రోజుల తరువాత పచ్చదనం సంతరించుకుంది. అటువైపుగా ప్రయాణించిన వారు నెల రోజుల క్రితం తాము చూసింది ఈ చెట్టు నేనా అని ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

పోలింగ్ తీరుపై చర్చ



చింతలపేటలో ఓటు వేసేందుకు సోమవారం అర్ధరాత్రి క్యూలో ఉన్న మహిళలు (ఫైల్)

- గుర్ల మండలంలో 86.75 శాతం పోలింగ్

గుర్ల: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈనెల 13వ తేదీన ప్రశాంతంగా ముగిసింది. చీపురుపల్లి నియోజకవర్గంలో గుర్ల మండలం 86.75 శాతం పోలింగ్‌తో ప్రథ మ స్థానంలో నిలిచింది. ప్రజలు ఎండను సైతం లెక్క చేయకుండా క్యూలైన్లలో ఓపిగ్గా నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల రాత్రి వరకు పో లింగ్ సాగింది. మండల వ్యాప్తంగా 64 కేంద్రాల పరిధిలో పోలింగ్ నిర్వహించారు. మండలంలో 53,582 మంది ఓటర్లకుగాను 46,510 మంది తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. గరికివలస, గుర్ల, నాగళ్లవలస, నడుపూరు, గరికివలస, చింతలపేట, కొండగంట్రేడు, పెద్దబంటుపల్లి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. చింతలపేటలో తెల్లవారు జాము వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ భారీస్థాయిలో జరగడంపై అంతటా చర్చనీయాంశమైంది. ఎవరి వైపు ఓటర్లు మొగ్గు చూపారోనని వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు లెక్కలుకడుతున్నారు. గ్రామాల వారీగా పోలింగ్ వివరాలను తెప్పించుకుని ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయనే దానిపై స్థానిక నాయకులను ఆరా తీస్తున్నారు.

మండలంలో బూత్‌ల వారీగా పోలింగ్ వివరాలు...

బూత్ నంబర్	గ్రామం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
194	నడుపూరు	1,128	945
195	భూపాలపురం	1,073	938
196	ఆనందపురం	818	763
197	ఆనందపురం	718	650
198	కోటగండ్రేడు	910	673
199	కోటగండ్రేడు	960	738
200	కలవచర్ల	790	708
201	చింతలపేట	1,162	1,001
202	చింతలపేట	1,093	991
203	సాలిపిసోమరాజుపేట	715	696
204	సాలిపిసోమరాజుపేట	684	612
205	మణ్యపురిపేట	484	450
206	గుర్ల	890	760
207	గుర్ల	858	824
208	గుర్ల	796	692
209	గోషాడ	814	762
210	గూడేం	902	729
211	గూడేం	869	727
212	పున్నపురెడ్డిపేట	953	863
213	పాలవలస	914	803
214	పాలవలస	834	753
215	గరికివలస	1,090	965
216	గరికివలస	1,147	982
217	పల్లిగండ్రేడు	930	820
218	కొండగండ్రేడు	1,140	884
219	ముద్దాడపేట	1,128	908
220	పకీరుకిట్టాలి	617	497
221	పకీరుకిట్టాలి	544	459
222	తాతావారికిట్టాలి	565	484
223	పెనుబర్తి	1,149	918
224	పెనుబర్తి	1,153	1,022
225	చింతపల్లిపేట	751	636
226	తెట్టంగి	877	763
227	తెట్టంగి	823	714
228	పోలాయవలస	896	747
229	గుజ్జింగివలస	1,108	998
230	మీసాలపేట	632	596
231	చోడవరం	680	579
232	చోడవరం	433	348
233	అచ్యుతాపురం	461	388
234	జమ్ము	682	641
235	జమ్ము	569	533
236	జమ్ముపేట	951	880
237	గరిడ	1,120	1,012
238	కెల్ల	951	908
239	కెల్ల	1,072	958
240	కెల్ల	995	823
241	కెల్ల	1,014	855
242	దమరసింగి	841	693
243	దమరసింగి	779	646
244	వల్లాపురం	1,024	871
245	వల్లాపురం	461	405
246	శేషుపేట	635	569
247	నాగళ్లవలస	1107	998
248	సదానందపురం	522	484
249	రాగోలు	677	600
250	రాగోలు	545	503
251	గొలగాం	920	836
252	దేవునికణపాక	935	669
253	పెద్దబంటుపల్లి	785	646
254	పెద్దబంటుపల్లి	623	536
255	రాతుపేట	690	590
256	లవిడాం	811	741
257	తాటిపూడి	423	363

ఆది నుంచి ఆమే నిర్ణేత



బొడ్డవర గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

- ఎస్.కోటలో పురుష ఓటర్ల కన్నా మహిళలే ఎక్కువ
- ఆది నుంచి అతివలదే హవా
- పెరిగిన రాజకీయ చైతన్యం
- పెరుగుతున్న పోలింగ్ శాతం

శృంగవరపుకోట: ఎస్.కోట పీఠాన్ని దక్కించుకోవాలంటే మహిళా మణులు దయ ఉండాల్సిందే. ఇక్కడి మహిళలు ఎవరిపై చల్లని చూపు చూస్తే వారే అధికారం దక్కించుకుని అందలం ఎక్కడం ఖాయం. మహిళా ఓటర్ల ప్రాపకం కోసం రాజకీయ పార్టీలు, నాయకులు అదే పంథా అనుసరిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకోగలిగిన వారే అధికారం అందుకుంటున్నారు.

మహిళా ఓటర్లే అధికం..

శృంగవరపుకోట నియోజకవర్గం ఆవిర్భావం నుంచి నేటి వరకూ పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికం గా ఉంటున్నారు. క్రమంగా మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీంతో పాటు మహిళా ఓటర్లలో రాజకీయ చైతన్యం పెరుగుతోంది. తొలుత రాజకీయాలు, ఎన్నికలకు దూరంగా ఉన్న మహిళలు తర్వాత ఎలక్షన్ నాడు ఇష్టం లేకున్నా వచ్చి ఓటు వేసేవారు. క్రమంగా పరిస్థితి మారింది. నేడు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తూ, తామే రాజకీయాలు నడిపే స్థాయికి చేరారు. వార్డు మెంబర్ నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీల వరకూ, పలు నామినేటెడ్ పోస్టుల్లోనూ సింహభాగం అతివలకే దక్కాయి.

పెరుగుతున్న పోలింగ్

పూర్వం నుంచి క్రమంగా మహిళా ఓటర్ల పోలింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. తొలుత సరైన రాజకీయ చైతన్యం, విద్య లేకపోవడం, రాజకీయాలపై నిరాసక్తత, ఎలక్షన్ మగాళ్ల వ్యవహారం అనుకుంటూ ఓటేసేందుకు వెనుకడుగు వేసేవారు. నేడు పరిస్థితి మారడంతో క్రమంగా పోలింగ్ శాతంలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ వస్తోంది. నేటి సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే జరిగింది.

ఎస్.కోట నియోజకవర్గంలో పురుషులు,మహిళా ఓటర్ల వివరాలు

ఎన్నిక జరిగిన సవంత్సరం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు
2024	1,07,188	1,13,117
2019	1,04,125	1,08,492
2014	99,524	1,02,988
2009	92,436	97,661
2004	71,108	77,544
1999	69,237	73,048
1994	70,038	74,133
1989	67,423	69,660
1985	54,794	58,931
1983	50,983	55,221
1978	47,940	51,626
1972	39,985	44,420

ఎవరి లెక్కలు వారివే..

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మధ్యాహ్నం వరకూ మందకొడిగా సాగిన పోలింగ్ తర్వాత ఊపందు కుంది. మధ్యాహ్నం 3గంటల తర్వాత ఒక్కసారిగా మహిళలు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. సాయంత్రం 6గంటల వరకూ క్యూలో నిల్చుని ఓటేశారు. కొన్ని గ్రామాల్లో రాత్రి 9గంటల వరకూ నిరీక్షించి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు తమకే ఓటు వేశారని వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. మహిళలు సీఎం.జగన్‌కు అండగా ఉన్నారని, తమ గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తుంటే... మహిళా ఓటర్లు తమ సూపర్ సిక్స్ ఎఫెక్ట్‌తోనే ఓటు వేసేందుకు క్యూ కట్టారని కూటమి నేతలు చెబుతున్నారు. ఏదేమైనా ఈమహిళా మణుల నిర్ణయం నేతల భవితవ్యాన్ని మార్చనుంది.

లక్ష్యానికి మించి..

- డీసీసీబీ ద్వారా రైతులకు పంట రుణాలు
- ఏటా రైతులకు రుణ పరిమితి పెంపు
- ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్

పూసపాటిరేగ : రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటూ అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విరివిగా వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తోంది. విత్తు నుంచి పంట విక్రయాల వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా తోడ్పాటు అందిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. సకాలంలో పంట రుణాలు ఇచ్చి భరోసాగా నిలుస్తోంది. రైతులకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉంటామంటూ భరోసా కల్పించి రైతులకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు ప్రభుత్వమే చర్యలు తీసుకుంటోంది. పూసపాటిరేగ, నవరవిల్లి డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో సుమారు 10,000 మంది రైతులు ఉన్నారు. వీరందరికీ పంటరుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు చర్యలు తీసుకున్నారు. పూసపాటిరేగ, నవరవిల్లి డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో గల పూసపాటిరేగ , వెంపడాం, కుమిలి, లంకలపల్లిపాలెం, పోలిపల్లి, భోగాపురం, డెంకాడ సొసైటీల పరిధిలో గల రైతులకు లక్ష్యానికి మించి మూడేళ్లుగా రుణాలు అందిస్తున్నారు. 2021 - 22 సంవత్సరంలో రూ.10.50 కోట్లు, 2022 - 23 సంవత్సరంలో రూ. 9.5 కోట్లు, 2023 - 24 సంవత్సరంలో 9 కోట్ల రూపాయలను రుణాలుగా అందించారు. పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్ ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు అందిస్తూ, వారి అవసరాలు తీరుస్తున్నారు.

విరివిగా రుణాలు

రైతులకు విరివిగా రుణాలు అందించేందుకు నిర్ణయించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయం , వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న రైతులందరికీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లక్ష్యానికి మించి మూడు సీజన్‌లలో రైతులకు రుణాలు అందించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరు నాటికే లక్ష్యానికి మించి రుణాలు అందజేశాం.

పైడి శ్రీలత,
బ్రాంచి మేనేజర్, డీసీసీబీ బ్రాంచ్, పూసపాటిరేగ